E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 22-05-2026 (వారం) శుక్రవారం సంపుటి: 02 || సంచిక:139|| పేజీలు–6
www.ekaburu.com

సభ్యత్వ నమోదుకు ఇన్‌చార్జిలు

- 119 నియోజకవర్గాల జాబితా విడుదలచేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- సభ్యత్వ నమోదుకు సిద్ధమవుతున్న డిజిటల్ యాప్
- డిజిటల్ సభ్యత్వ నమోదుపై ఇన్‌చార్జిలకు శిక్షణ.. ఆ తర్వాత జిల్లాల్లో శిబిరాలు
- శిక్షణ పూర్తయిన తర్వాత సభ్యత్వ నమోదు షెడ్యూలు ప్రకటన

కోటి ఆశలు నెరవేర్చాం!

కార్మికుల కనీస వేతనాల పెంపు..
సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి
అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్,స్కిల్డ్, హైస్కిల్డ్‌గా కార్మికుల విభజన
కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల ఆధారంగా వేతనాల ఖరారు
కనీస వేతనాలు అమలు చేయని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామన్న ముఖ్యమంత్రి
గల్ఫ్ కార్మికులకు సంబంధించి మంచి పాలసీతో వస్తామని వెల్లడి

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని 1.11 కోట్ల మంది కార్మికుల కనీస వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. కార్మికులను అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైస్కిల్డ్ అనే నాలుగు కేటగిరీలుగా విభజించి వారు పనిచేసే గ్రామీణ/పట్టణ ప్రాంతాల ఆధారంగా వారి వేతనాలను సవరించింది. జూన్ 1 నుంచి ఈ కొత్త వేతనాలు అమల్లోకి రానున్నాయి. ఇప్పటివరకు గ్రామీణ, పట్టణ అనే రెండు జోన్లు ఉండగా, తాజాగా మున్సిపల్ కార్పొరేషన్లు (జోన్-1), మున్సిపాలిటీలు (జోన్-2), గ్రామీణ ప్రాంతాలు (జోన్-3) అనే మూడు జోన్ల ఆధారంగా వేతనాలను ఖరారు చేసింది. స్థానికంగా ఉండే ఇళ్ల అద్దెలు, నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలను పెంచింది. జోన్-1లో అన్‌స్కిల్డ్ కార్మికుల కనీస వేతనం రూ.12,750 నుంచి రూ.16 వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ

మిగతా 2లో

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీస వేతనాలు నిర్ణయించకపోవడంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్‌తో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి కార్మిక, పారిశ్రామిక సంఘాలతో చర్చించి ఉభయతారకంగా ఈ నిర్ణయం తీసుకున్నాం..

కాంటా తంటా.. తాలు మోసాలు!

- నెలన్నర దాటినా ముమ్మరంగా సాగని కొనుగోళ్ల ప్రక్రియ

ఈకబురు, నల్లగొండ: రాష్ట్రంలోని 28 జిల్లాల పరిధిలో కొనుగోలు కేంద్రాలకు ఇప్పటివరకు 54,53,622 మెట్రిక్ టన్నుల (ఎంటీ) ధాన్యం వచ్చింది. అందులో ఈ నెల 18వ తేదీ వరకు 39,74,335 ఎంటీల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయినా మరో 14,79,287 ఎంటీల ధాన్యం కేంద్రాల్లోనే ఉంది. ఇక కొనుగోలు చేసిన ధాన్యంలోనూ 2,87,540 ఎంటీల ధాన్యం మిల్లులకు పంపకుండా కేంద్రాల్లోనే ఉంచారు. అంటే అధికారిక లెక్కల ప్రకారమే 17,66,827 ఎంటీల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయింది.

02

తెలంగాణలో తొలిసారి..

సరస్వతీ నది అంత్య పుష్కరాలు

ఈ-కబురు సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు.

కేంద్ర మంత్రుల్లో వేటు ఎవరిపై?

శాఖల వారీగా పనితీరు నివేదికలను వివరించిన క్యాబినెట్ కార్యదర్శి
కొందరు మంత్రులకు మోదీ క్లాసు
ప్రభుత్వ పనితీరు మారాలని హితవు

03

జూన్ 2లోగా నెరవేర్చకపోతే... మరోఉద్యమం

- జూన్ 2 లోగా ఉద్యమకారులకు, అమరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి
- జూన్ లోనే ప్రైవేట్ స్కూల్స్ ఫీజు దోపిడీ నియంత్రణకు చట్టం చేయాలి
- సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు గ్రేడ్ బి అంటూ మోసం చేస్తున్న కర్నాటక సర్కార్ ఇది
- వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి, సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలి
- లేదంటే ప్రభుత్వంపై ఉద్యమ తప్పదు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత
- కుత్బుల్లాపూర్ లో టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ. పార్టీ లోకి భారీగా చేరికలు

"ఎవరిది గొడ్డలి పార్టీ..? ఎవరిది గన్ కల్చర్..?"

..జగన్ తీవ్ర విమర్శలు

ఈ-కబురు, అమరావతి:
వై . ఎస్ . జగన్ మోహన్ రెడ్డి గురువారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ హింస, కుటుంబ సభ్యుల మరణాల అంశాలను ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. జగన్ మాట్లాడుతూ..చంద్రబాబు అధికారంలో ఉండగానే నా తాత రాజారెడ్డిని చంపేశారు" అన్నారు. "మా నాన్న వై . ఎస్ . రాజశేఖర రెడ్డి ను అసెంబ్లీకి ఎలా వస్తావో చూస్తానని చంద్రబాబు అన్న రెండు మూడు రోజులకే హెలికాప్టర్ ప్రమాదం జరిగింది" అని వ్యాఖ్యానించారు.

'ధరణి' తిప్పలు తప్పిస్తున్నాం..

- నాడు దొరల గడీల్లో.. నేడు పేదల చేతుల్లో పట్టాలు
- ప్రజాదర్బార్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 2లో

స్త్రీ శక్తి థీమ్‌తో... మహానాడు-2026

- 20 తీర్మానాలను చేపట్టాలని టీడీపీ పొలిట్ బ్యూరోలో నిర్ణయం
- పండుగలా మహానాడు నిర్వహించాలన్న టీడీపీ అధినేత

ఈ-కబురు, అమరావతి, మే 21:
మహానాడు 2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది. 20 తీర్మానాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. గురువారం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్‌గా జరిగిన ఈ పొలిట్ బ్యూరో భేటీలో సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు,

కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి

03

చెన్నై కథ ముగిసె.. టైటాన్స్ చేతిలో చిత్తు

ఐపీఎల్-19లో చెన్నై కథ ముగిసింది. మిణుకుమిణుకుమన్న ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో సూపర్‌కింగ్స్ చిత్తుగా ఓడిపోయింది.

రైల్వే నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తాం

- రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్
- రైల్వే మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలో 42 ప్రధాన స్టేషన్ల
- అభివృద్ధిపై సమగ్ర చర్చ
- కొత్త లైన్లు, హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై సమీక్ష

02

సభ్యత్వ నమోదుకు ఇన్‌చార్జిలు

ఈకబురు, హైదరాబాద్: డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు కోసం బీఆర్ఎస్ చేస్తున్న సన్నాహాల్లో భాగంగా పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ప్రకటించారు. ఇప్పటికే పార్టీ ప్రధాన కార్యదర్శులకు జిల్లాల వారీగా సభ్యత్వ నమోదు సమన్వయ బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా నియమితులైన ఇన్‌చార్జిలు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారు. ఈ మేరకు 119 నియోజకవర్గాల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిల పేర్లతో కూడిన జాబితాను కేసీఆర్ గురువారం విడుదల చేశారు. సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలతో పాటు ప్రతీ నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఐటీ నిపుణుడికి తెలంగాణ భవన్‌లో డిజిటల్ పద్ధతిలో నమోదుపై శిక్షణ ఇస్తారు. డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు కోసం రూపొందిస్తున్న డిజిటల్ యాప్‌కు తుది మెరుగులు పూర్తయిన తర్వాత త్వరలో ఇది అందుబాటులోకి రానున్నది.

ఇదిలా ఉంటే తెలంగాణ భవన్‌లో శిక్షణ అనంతరం జిల్లా కేంద్రాల్లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల్లో ఇప్పటికే నియమితులైన పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ కోసం నియోజకవర్గాల్లోని బూత్‌ల సంఖ్య ఆధారంగా ఒక్కో పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున స్మార్ట్ ఫోన్ కలిగిన కార్యకర్తలను ఎంపిక చేసి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారు.

శిక్షణ పూర్తయిన తర్వాత డిజిటల్ సభ్యత్వ నమోదు తేదీని ప్రకటిస్తారు. తొలి రోజున పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌తో పాటు ముఖ్య నేతలు పాల్గొని తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకుంటారు. సభ్యత్వ నమోదు పూర్తయిన తర్వాత గ్రామ స్థాయినుంచి రాష్ట్రస్థాయి వరకు సంస్థాగత కమిటీ ఎన్నికల షెడ్యూలును ప్రకటించనున్నారు.

'ధరణి' తిప్పలు తప్పిస్తున్నాం..

ఈకబురు,సత్తుపల్లి: గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ధరణి పోర్టల్‌లోని లోపాలతో పేదలు,రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోగా.. భూభారతి చట్టం ద్వారా ఆ సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నాడు దొరల గడీల్లో బందీ అయిన భూరికార్డులను విడిపించి, భూములపై పేదలకు సర్వాధికారాలు కల్పించడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో గురువారం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల ప్రజల నుంచి ఆయన దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రూపాయి లంచం లేకుండా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడమే కాక, నిర్మాణంలో దశల వారీగా ప్రతీ సోమవారం బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో 1.5 లక్షల ఇళ్లు పూర్తికాగా, జూన్ నాటికి మరో లక్ష ఇళ్లు పూర్తి చేస్తామన్నారు.

అంతేకాక జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమవుతుందని చెప్పారు. అర్హులైతే చాలు గులాబీ కార్యకర్తలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, ఇళ్లు రాని పేదలు బాధపడొద్దని.. విడతల వారీగా అందరికీ మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, కలెక్టర్ దివాకర టి.ఎస్. తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో తొలిసారి.. సరస్వతీ నది అంత్య పుష్కరాలు

ఈకబురు సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉదయం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు.

పుష్కర విశిష్టత..

ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్పణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.

కోటి ఆశలు నెరవేర్చాం!

13,592 నుంచి రూ.17 వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,772 నుంచి రూ.18,500కు, హై స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచినట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జి.వివేక్‌తో కలిసి గురువారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్మిక వర్గానికి సీఎం ఈ తీపి కబురు వినిపించారు. వారికి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

'కార్పొరేషన్లలో ఇళ్ల అద్దెలు, ధరలు, ద్రవ్యోల్బణం ఎక్కువ కాబట్టి అక్కడ ఎక్కువ వేతనాలను, మున్సిపాలిటీల్లో కొంచెం తక్కువగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకొంచెం తక్కువగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. వేతనాల పెంపును మే డే రోజే ప్రకటిద్దామనుకున్నా కొందరి సూచనల కోసం ఆలస్యమైంది. కనీస వేతనాల పెంపు అమలు చేయని పరిశ్రమలపై కార్మిక శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటారు. కార్మికశాఖ ను ఇంకా బలోపేతం చేస్తాం. ప్రభుత్వ ప్రోత్సాహకాలు తీసుకున్న పరిశ్రమల్లో 80% ఉద్యోగాలను స్థానికులకే ఇచ్చేలా నిబంధన పెట్టేందుకు అవకాశం ఉంది..' అని సీఎం అన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉద్యోగ భద్రత

'ఏఐ వచ్చాక వైట్ కాలర్ జాబ్ ఉద్యోగాలొచ్చే పరిస్థితీ, ఉద్యోగ భద్రతా లేదు. చాలా దేశాల్లో ఐటీ ఉద్యోగాలు పోతున్నాయి. అమెరికాలో కోట్లాది మంది ఐటీ రంగ ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి. వారు తిరిగి రాష్ట్రానికి వచ్చే పరిస్థితి ఉంది. సాఫ్ట్‌వేర్ చదివితే రూ.లక్ష ఉద్యోగం వస్తుందో రాదో తెలియదు కానీ సాంకేతిక నైపుణ్యంతో కూడిన చదువులతో రూ.2 లక్షల ఉద్యోగం వచ్చే అవకాశం ఉంది. బ్లూకాలర్ జాబ్స్‌కు ప్రపంచంలో విస్తృత డిమాండ్ ఉంది. ఈ ఉద్యోగాలను ఏఐ రీప్లేస్ చేయ లేదు. సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకుంటే జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, ఫిలిప్పీన్స్‌లో కొన్ని కోట్ల ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయి. మీ దగ్గర నైపుణ్యం కలిగిన వారుంటే పంపాల ని ఈ దేశాలు మన ప్రభుత్వాన్ని అడుగుతున్నాయి. నర్సింగ్, సాంకేతిక రంగాల్లో ఎంత మందిని పంపిస్తారని అడుగుతున్నాయి.

ఆ దేశాలకు ప్రత్యామ్నాయంగా తెలంగాణ

స్కిల్స్ వర్సిటీ, ఐటీసీల ఏర్పాటు, పాలిటెక్నిక్ కళాశాలల అప్‌గ్రేడేషన్‌తో ప్రభుత్వం పూర్తిగా బ్లూకాలర్ ఉద్యోగాల మీద దృష్టి పెట్టింది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లో చేరితే నెలకు రూ.2 వేలు స్టైపెండ్ ఇస్తున్నాం. స్కిల్స్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్‌లో చేరేవారి కోసం కూడా మంచి ప్రతిపాదనతో ముందుకు వస్తాం. యువతకు జపనీస్, జర్మన్, కొరియన్ భాషలను నేర్పడానికి ఆయా దేశాలతో ఒప్పందాలు చేసుకున్నాం. జర్మనీ, చైనా, జపాన్, సౌత్ కొరియా, సింగపూర్‌లో 80 శాతం మందికి ఆంగ్లం రాదు. సాంకేతిక నైపుణ్యంతో ప్రపంచాన్ని శాసిస్తున్నారు. ప్రపంచ అవసరాలన్నీ ఈ నాలుగైదు దేశాలే తీరుస్తున్నాయి. ఈ దేశాలకు ప్రత్యామ్నాయంగా తెలంగాణను తీర్చిదిద్దాలని మా ప్రయత్నం. ఏఐ తుపాన్‌లో అమెరికానే కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. బ్లూ కాలర్ స్కిల్ నేర్చుకుంటే 100 శాతం జీవిత భద్రత ఉంటుంది..'అని రేవంత్ అన్నారు.



గల్ఫ్ వెళ్లే వారికి శిక్షణ

'ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లాలనుకునే వారికి ప్రభుత్వ మే శిక్షణ ఇవ్వాలనే ఆలోచన చేస్తున్నాం. స్కిల్స్ వర్సిటీలో ఆరు నెలల శిక్షణ నుంచి నుంచి పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ వరకు వారికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది. గతంలో గల్ఫ్ కార్మికులు చనిపోతే శవాలను సైతం ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పుడు రూ.5 లక్షల బీమా ఇవ్వడంతో పాటు శవాలను తీసుకొస్తున్నాం. గల్ఫ్ ఏజెంట్లు పడగలెత్తి పెద్దపెద్ద పదవుల్లోకి వచ్చారు. కానీ కార్మికులు మోసపోతున్నారు. గల్ఫ్ కార్మికులకు సంబంధించి త్వరలో మంచి పాలసీతో వస్తాం..'అని సీఎం చెప్పారు

. ప్రధాని ప్రతిదీ రాజకీయ కోణంలోనే మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. తాము కార్మికుల కోణం చూస్తాం కాబట్టి ఈ రోజు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాంటా తంటా..తాలు మోసాలు!

ఇక 36,86,795 ఎంటీల ధాన్యం మిల్లులకు వెళ్లినా, అందులో 6,00,143 ఎంటీల ధాన్యాన్ని మిల్లర్లు దింపుకోలేదు. మొత్తంగా ఇలా 23.66 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. కొనుగోళ్లు ప్రారంభమై నెలన్నర దాటిపోయింది. మే నెలాఖరుకల్లా కొనుగోళ్లు చివరి దశకు చేరుకోవాల్సి ఉంది. అయినా 43.38 శాతం ధాన్యానికి సంబంధించిన రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. కొనుగోళ్ల వ్యవహారంలో అధికారులు విఫలం కావడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లారీలు రాక మండుటెండలో..

రాష్ట్ర వ్యాప్తంగా యాసంగిలో 60 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేయగా, 151 ఎల్ఎంటీల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అందులో దాదాపు 40 శాతం మిల్లర్లు నేరుగా కొను గోలు చేసినా, మిగతా 60 శాతం కొనుగోలు కేంద్రాల ద్వారానే కొనాలి. కానీ అందులో కొనుగోలు చేసింది 65 శాతం లోపే. ఇక 8,575 కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ట్రక్కులు, ట్రాక్టర్లు, లారీలు కలిపి 11500 రవాణా వాహనాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది.

కానీ క్షేత్ర స్థాయిలో అందులో సగం కూడా కనిపించడం లేదు. రాష్ట్ర స్థాయి లో లారీలను సమకూర్చు తామంటూ టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. తమ వద్ద అందుబాటులో ఉన్నాయని పేర్కొన్న లారీల్లో సగం కూడా ధాన్యం రవాణాకు సమకూర్చకపోవడంతో రైతులకు తంటాలు తప్పడం లేదు. ఈ విషయంలో అధికార యంత్రాంగం వారికే వంత పాడుతోందనే ఆరోపణలున్నాయి.

లారీలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ఆగిపోతుండగా, మరికొన్ని జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాలకు రోజు విడిచి రోజు కూడా లారీలు రావడం లేదు. దీంతో రైతులు మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అకాల వర్షాల భయంతో ఏదోలా అమ్ముకొని ఇంటికి వెళదామంటే సకాలంలో లారీలు రాకపోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు.

తాలు పేరుతో అడ్డగోలు దోపిడీ

మరోవైపు కొనుగోలు కేంద్రంలోనే తాలు పేరుతో కిలో, రెండు కిలోలు అదనంగా దోపిడీ చేస్తుండగా, మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దింపుకునేందుకు తాలు పేరుతో కొర్రీలు పెడుతూ నాలుగైదు కిలోలు కోత పెడుతున్నారు. మొత్తం మీద కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ధాన్యం తూకం వేసినందుకు హమాలీలకు కమీషన్ ఇవ్వాల్సి వస్తుండగా, లారీల వారు కూడా రైతుల నుంచి బస్తాకు రూ.3 చొప్పున వసూలు చేస్తున్నారు. అలా డబ్బులు ఇస్తేనే కొనుగోలు కేంద్రానికి లారీలను పంపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మొత్తం మీద కష్టపడి ధాన్యం పండించిన రైతులు ఆ ధాన్యం అమ్ముకోవడానికి సైతం నానా కష్టాలూ పడుతూ, నష్టపోవాల్సిన పరిస్థితులు ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డగోలుగా ధాన్యం దోపిడీ

నల్లగొండ జిల్లాలోని ఓ కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని బస్తాకు 40 కిలోల 700 గ్రాముల చొప్పున తూకం వేయాల్సి ఉన్నా, దానిని 42.5 కిలోల చొప్పున తూకం వేసి ఒక్కో బస్తాకు కిలో 800 గ్రాములు దోచుకున్నారు. ఒక లారీలో 1057 బస్తాలు వేస్తే దానిపై 19 క్వింటాళ్లు కోత పెట్టారు. ఆ ధాన్యం బస్తాలను మిల్లుకు పంపించగా, సదరు మిల్లర్.. బస్తాకు 40 కిలోల 700 గ్రాముల చొప్పున లెక్కించి 1,038 బస్తాలుగానే పరిగణనలోకి తీసున్నాడు. అంటే ఇక్కడ 19 బస్తాలకు కోత పెట్టారు. అంటే మిల్లులో దాదాపు 7.7 క్వింటాళ్లు కోత పెట్టారు. ఇలా ఒక్క లారీపైనే ఇటు కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, అటు మిల్లర్లు కలిసి 26.7 క్వింటాళ్ల వరకు కోత పెట్టి, ఆ రైతుల నుంచి ఏకంగా రూ.63 వేలు దోచుకున్నారు.

లారీలు ఎప్పుడొస్తాయో..

ధాన్యం మార్కెట్‌కు తెచ్చి నెల అవుతోంది. ఇంతవరకు తరలించలేదు. లారీలు రాలేదు. ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో పట్టాలు కప్పి కాపలా ఉండాల్సి వస్తోంది. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. - బోడ హెమ్లా, బిస్రాజుపల్లి తండా, తిరుమలాయపాలెం, ఖమ్మం

కోతకు ఒప్పుకుంటేనే అన్‌లోడ్

నేను పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించా. 437 బస్తాలు తూకం వేసి మిల్లుకు పంపించారు. మిల్లర్ క్వింటాలుకు 14 కిలోల తరుగు అడిగాడు. అడిగినంత తరుగుకు ఒప్పుకుంటేనే బస్తాలు దింపుకుంటాననడంతో ఏం చేయలేక అంగీకరించా. ఇదేం దోపిడీయో అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. - ఏనుగు చిన్న బాల్‌రెడ్డి, మైలారం, ధర్పల్లి, నిజామాబాద్

లారీకి రూ.5 వేలు ఇవ్వాలంట

ధాన్యం ఆరబెట్టి మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ సెంటర్‌లో బస్తాలు నింపి కాంటా కోసం సిద్ధంగా ఉంచా. ఇప్పటికి 29 రోజులు కావస్తున్నా నేటికీ కాంటా పెట్టలేదు. లారీకి రూ.5 వేలు ఇస్తే కాంటా పెడతామని చెపుతున్నారు.

రైల్వే నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తాం

ఈకబురు,న్యూఢిల్లీ: రాబోయే రోజుల్లో రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తామని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, మౌలిక వసతుల కల్పనపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు. గురువారం ఢిల్లీలోని రైల్వే భవన్‌లో అశ్వినీ వైష్ణవ్‌తో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులు, కొత్త లైన్లు, ఎలక్ట్రిఫికేషన్ పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా సమీక్షించారు. తెలంగాణలోని 42 ప్రధాన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఈ సమావేశంలో వివరంగా చర్చించారు. ఈ స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించేందుకు తీసుకుంటున్న చర్యలను రైల్వే మంత్రి వివరించారు.

ఎంఎంటీఎస్‌పై త్వరలో ప్రత్యేక సమావేశం..

హైదరాబాద్ మహానగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, ఉద్యోగులకు అత్యంత కీలకమైన రవాణా సాధనంగా ఉన్న ఎంఎంటీఎస్ సేవలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఎంఎంటీఎస్ రైళ్ల వేళలను క్రమబద్ధీకరించాలని, ప్రయాణికులకు సౌకర్యాలను మరింత మెరుగుపరిచేలా చొరవ తీసుకోవాలని ఆయన రైల్వే మంత్రిని కోరారు. కిషన్‌రెడ్డి విజ్ఞప్తిపై అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు.

ఈ అంశంపై త్వరలోనే అధికారులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, హైస్పీడ్ రైల్ కారిడార్ పనుల పురోగతిపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.

రాష్ట్రం అగ్నిగుండం

ఈకబురు హైదరాబాద్: ప్రచండ భానుడి సెగలకు రాష్ట్రం అగ్నిగుండమైంది. గురువారం అన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆరుబయట కాలుపెట్టడానికే జంకే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా వడదెబ్బతో 22 మృతిచెందారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే 9 మంది ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడి తీవ్రత మొదలుకాగా పొద్దుపోయే వరకు వేడిగాలులు వీస్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో మునుపెన్నడూ లేనంత సంఖ్యలో 244 మండలాల్లో వడగాలులు వీచాయి. 20 జిల్లాల్లో 46 డిగ్రీలపైన, మరో మూడు జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం(ఎంఎన్‌టీ), సూర్యాపేట జిల్లా మునగాల మండలాల్లో 46.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక ఉష్ణోగ్రత 2019లో రామగుండంలో నమోదైన 47 డిగ్రీలు. ఈ ఒక్క ప్రాంతం మినహా గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు రికార్డులను తిరగరాశాయి. ఒకేసారి 20 జిల్లాల్లో 46 డిగ్రీలను దాటడం కూడా ఇదే మొదటిసారి. 2019లో ఒకేరోజు ఆదిలాబాద్‌లో 46.3, ఖమ్మంలో 46.2, నిజామాబాద్‌లో 45.9, 2017లో నల్గొండలో 46.4, మెదక్‌లో 44.9, హనుమకొండలో 45, 2024లో మహబూబ్‌నగర్‌లో 45, హైదరాబాద్‌లో 43.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలే అంతకు ముందు వరకున్న రికార్డులు.

వణికించిన వడగాలులు

రాష్ట్రంలో ఒకేసారి 244 మండలాల్లో వడగాలులు నమోదుకావడం ఇదే తొలిసారి. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో 29 మండలాల్లో వడగాలులు వీచాయి. ఖమ్మం, నిజామాబాద్, మంచిర్యాల 18 చొప్పున, జగిత్యాల 17, నిర్మల్ 15, ఆసిఫాబాద్, మహబూబాబాద్ 14, భద్రాద్రి, పెద్దపల్లి 13, నల్గొండ 10, హనుమకొండ, వరంగల్, కరీంనగర్ 9, ములుగు 8, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి 7, ఆదిలాబాద్, జనగామ 6 చొప్పున, యాదాద్రి జిల్లాలో 4 మండలాల్లో నమోదయ్యాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలు కుతకుత ఉడుకుతున్నాయి. కొద్దిరోజులుగా ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల్లో భరించలేని వేడి ఉంటోంది. వడగాలులు నమోదైన మండలాల్లో అత్యధికం ఈ ప్రాంతాల నుంచే ఉన్నాయి. వృద్ధులు, రోగులు, చిన్నారులు అధిక వేడికి అవస్థలుపడ్డారు. ప్రయాణికులు, ఆరుబయట పనిచేసే కార్మికులు ఎండపోటును చవిచూశారు.

నేడు, రేపు రెడ్ ఎలర్ట్

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లోనూ పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పలు జిల్లాలకు 'రెడ్' ఎలర్ట్ (45 డిగ్రీలపైన) జారీ చేసింది. మహారాష్ట్ర, రాజస్థాన్ ప్రాంతాల నుంచి (వాయవ్య ప్రాంతం) తెలంగాణకు పొడిగాలులు వస్తున్నాయని వాతావరణశాఖ అధికారి ధర్మరాజు తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రంలో గాలిలో తేమ పడిపోయి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నట్లు సూచించారు. దీనికితోడు గాలి వేగం ఎక్కువగా ఉందని దీనివల్ల వడగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని హెచ్చరించారు.

శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వడగాలులు నమోదుకానున్నాయి.

శనివారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వీస్తాయి

జూన్ 2లోగా నెరవేర్చకపోతే... మరో ఉద్యమం

ఈకబురు, ,హైదరాబాద్:
తెలంగాణ అమరవీరులకు, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు జూన్ 2 లోగా నెరవేర్చకపోతే మరో ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రైవేట్ విద్య సంస్థల ఫీజు దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మైనార్టీ నేత అహ్మద్ తో పాటు పెద్ద ఎత్తున ఆయన అనుచరులు టీఆర్ఎస్ లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు కవిత. ఈ సందర్భంగా మాట్లాడారు. కుత్బుల్లాపూర్ నుంచే టీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చాక తామిచ్చిన పాంచజన్యం హామీలను అమలు చేస్తామన్నారు. కుత్బుల్లాపూర్ లో 20 ఏళ్ల క్రితం నిర్మించిన అమరుల స్థూపాన్ని జూన్ 2 లోగా ఆవిష్కరించాలని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. లేదంటే టీఆర్ఎస్ ఆధ్వర్యంలో అమరుల స్థూపాన్ని తామే ఆవిష్కరిస్తామని హెచ్చరించారు.

జూన్ లో లోగా హామీలు అమలు చేయాలి

తెలంగాణ ప్రభుత్వం అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం లోగా నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయటం చేతకాక కేకే కమిటీ పేరుతో కాలయాపన చేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టిందని ఆమె మండిపడ్డారు. జూన్ 2 రోజు జెండా ఎగురవేసే కార్యక్రమం సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించాలని అల్టిమేటం జారీ చేశారు. లేదంటే ఈ ప్రభుత్వం మీద మరో ఉద్యమం తప్పదని కవిత హెచ్చరించారు. ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల దోపిడీ మీద కూడా ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని కోరారు. ఇప్పటికే ఈ అంశంపై పలుమార్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఫీజు దోపిడీ నియంత్రణ జరగాలంటే జూన్ లో కచ్చితంగా ఫీజు నియంత్రణ చట్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కుత్బుల్లాపూర్ నుంచే జైత్రయాత్ర

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకుంటామని కవిత ధీమా వ్యక్తం చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో తమ అభ్యర్థులు పోటీ లో ఉంటారని చెప్పారు. కుత్బుల్లాపూర్ లో మొట్ట మొదటగా జెండా ఎగురవేసుకున్నట్లే ఇక్కడి నుంచే తొలి ఎమ్మెల్యే ను గెలిచుకొని జైత్రయాత్ర ప్రారంభిస్తామన్నారు. ఈ నియోజకవర్గంలో 20 ఏళ్ల క్రితమే నిర్మించిన అమరుల స్థూపాన్ని ఇప్పటికీ కూడా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ పార్టీ అని చెప్పుకునే పార్టీని

గెలిపించినప్పటికీ అమరుల స్థూపాన్ని ఆవిష్కరించలేదని చెప్పారు. జూన్ 2 లోగా ప్రభుత్వం అమరుల స్థూపాన్ని ఆవిష్కరించాలని కవిత డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో తామే స్థూపాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు.

అన్ని వర్గాలు ప్రతిబింబించేలా జెండా రూపకల్పన

తెలంగాణ రక్షణ సేన జెండాలోని పసుపు రంగు సౌభాగ్యానికి సూచిక అని కవిత చెప్పారు. పసుపంటే మన తంగేడు పువ్వు అని గుర్తు చేశారు. ఆదివాసీ, బీసీలను సూచించేది పసుపు అని చెప్పారు. జెండాలోని మరొక రంగు నీలిరంగు అన్నారు. నీలి రంగు అంటే కూలీ, నాలీ చేసే కార్మికులు,ఎస్సీ, ఎస్టీ, ఆడబిడ్డలని చెప్పారు. ఇక పచ్చ రంగు పర్యావరణానికి సూచిక అని చెప్పారు. మైనార్టీలను కూడా పచ్చ రంగు సూచిస్తుందన్నారు. అన్ని వర్గాలను ప్రతిబింబిచేలా తెలంగాణ రక్షణ సేన జెండాను రూపొందించామన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల రక్షణ కోసం పుట్టిన పార్టీయే తెలంగాణ రక్షణ సేన అని చెప్పారు.ఈ ప్రాంతం దుఖం పోయేందుకు టీఆర్ఎస్ కార్యకర్తలంతా సైనికుల మాదిరిగా పోరాడాలని సూచించారు.

పాంచజన్యం అమలు చేస్తాం

తెలంగాణలో విద్య, వైద్యం కోసం చేస్తున్న ఖర్చు కారణంగా ప్రజల ఇళ్లు గుల్ల అవుతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు మంచి చేయాలంటే కార్పొరేట్ స్థాయి వైద్యం, విద్యను పూర్తిగా ఉచితంగా అందించాల్సి ఉందన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే విద్య, వైద్యం విషయంలో ప్రజలపై పైసా భారం పడనివ్వమని కవిత చెప్పారు. రైతులను ఈ దుర్మార్గపు, కర్కోటక ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఒక్క రైతు కూడా సంతోషంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవటంతోనే ధాన్యం కుప్పలపై రైతులు చనిపోతున్న పరిస్థితి ఉందన్నారు. సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టేందుకు గ్రేడ్ బీ అంటూ రాస్తున్నారని కవిత మండిపడ్డారు. రైతుల పక్షాన తాము పోరాడుతామని భరోసా ఇచ్చారు. యువతకు 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు వారు వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఇస్తామని చెప్పారు. రాష్ట్ర యువతపై నమ్మకం ఉంచి వారి కలలను సాకారం చేసేందుకు తాము ప్రోత్సహం అందిస్తామన్నారు. సామాజిక న్యాయ తెలంగాణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు అన్ని వర్గాలకు న్యాయం చేసేలా పోరాటం చేస్తామని చెప్పారు. నేను మీ బిడ్డను మీకు ఏం కావాలో నాకు తెలుసు అంటూ ప్రజలను ఉద్దేశించి కవిత వ్యాఖ్యనించారు.

కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి

ఈకబురుహైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అరాచకత్వం పరాకాష్ఠకు చేరిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటను కొనే దిక్కులేక రెండు నెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్తనాదాలు చేస్తున్నా సర్కారుకు చీమ కుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు. ఈ నెల 23న జరిగే కేబినెట్ మీటింగ్‌లోనైనా పంట కొనుగోళ్లలో నెలకొన్న సంక్షోభంపై ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడి పరిష్కారం చూపాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ శుక్రవారం లేఖ రాశారు. 'ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు ప్రతీరోజూ ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు పడుతున్న రైతులు గుండె పగిలి కుప్ప కూలుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో దైర్యంతో బతికిన అన్నదాత కాంగ్రెస్ పాలనలో ఆత్మ విశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడు. రైతులకు రక్షణగా కేసీఆర్ అమలు చేసిన పథకాలను రేవంత్ ఒక్కొక్కటిగా పాతరేసి రైతుల వెన్ను విరించారు. రైతుభరోసా ఎగవేసినా, యూరియా కష్టాలు అధిగమించి రైతులు పండించిన పంటలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు'అని కేటీఆర్ మండిపడ్డారు.

పంటలు తగులబెట్టుకుంటున్నారు

'పంట కొనుగోలు చేసే నాథుడు లేక రైతులు తమ పంటలను తగుల పెట్టుకుంటున్నారు. రెండు నెలలుగా నిరసనలో పాల్గొనని రైతు లేదు, రాస్తారోరో జరగని రహదారి లేదు. పగలూరాత్రి ప్రజాసంపదను దోచుకోవడంపై తప్ప పరిపాలనపై సీఎంకు పట్టులేకపోవడం అన్నదాతకు శాపంగా మారింది. రోడ్లపై జరుగుతున్న నిరసనల నుంచి తప్పించుకునేందుకు మంత్రులు హెలికాప్టర్‌లో షికార్లు కొడుతున్నారు. సీఎం సొంత నియోజకవర్గం

కొడంగల్‌లోనూ రైతులు రోడెక్కి నిరసన తెలపడం రాష్ట్రంలో నెలకొన్న సాగు సంక్షోభానికి అద్దం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత, క్వింటాల్‌కు పది కిలోల తరుగు, గన్నీ బ్యాగులకు రూ.50 డిపాజిట్ వంటి సమస్యలను తీర్చేవారే

లేరు. పంట కొనుగోలు కూడా చేయడం చేతకాకపోతే రాష్ట్రంలోని 60 లక్షల మంది రైతులకు సీఎం క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయాలి. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి రైతుల పంటను కాపాడుకునేందుకు చివరకు టార్పాలిన్లు కూడా సమకూర్చలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. రెండు నెలలుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు కాంగ్రెస్‌కు మరణ శాసనం రాసేందుకు సిద్ధంగా ఉన్నారు'అని ఆ లేఖలో కేటీఆర్ హెచ్చరించారు.

కేంద్ర మంత్రుల్లో వేటు ఎవరిపై?

ఈకబురు, న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గంలో భారీగా మార్పులు, చేర్పులు జరగనున్నాయన్న అంచనాల నేపథ్యంలో గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం.. ఆ అంచనాలను బలపరిచే సంకేతాలనే ఇచ్చింది. తమ శాఖల పనితీరును వివరించే నివేదికలను వెంట తీసుకెళ్లిన మంత్రులు.. అప్పటికే ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఆయా శాఖల వారీగా తయారు చేసిన నివేదికలను చూసి ఖంగుతిన్నట్లు సమాచారం. తొలుత సమావేశాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడిన తర్వాత.. క్యాబినెట్ కార్యదర్శి మంత్రిత్వ శాఖల వారీగా మంత్రులు, వారి కార్యదర్శుల పనితీరును వివరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయా మంత్రులు, కార్యదర్శులు తమ బాఽధ్యతల నిర్వహణలో తీసుకున్న చర్యలు, లక్ష్యాలను సాఽధించడంలో వైఫల్యాలు, సరిదిద్దుకోవాల్సిన అంశాల గురించి మోదీ సమగ్రంగా సమీక్షించారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రధాని.. మంత్రులకు, కార్యదర్శులకు క్లాసు తీసుకున్నట్లు సమాచారం. 'దీంతో తమలో ఎవర్ని తప్పిస్తారు? కొనసాగిస్తే ఇప్పుడున్న శాఖలోనేనా? లేకపోతే వేరే ఏదైనా శాఖకు మారుస్తారా?' అన్న ఆందోళన మంత్రుల్లో కనపడిందని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఐదు దేశాల పర్యటన ముగించుకొని బుధవారం రాత్రి తిరిగి వచ్చిన నరేంద్రమోదీ.. గురువారం సాయంత్రమే సహాయ మంత్రులతో సహా క్యాబినెట్ మంత్రులందర్నీ సేవా తీర్థ్‌లోని తన కార్యాలయంలో సమావేశానికి రావల్సిందిగా ఆదేశించారు. ఆయా శాఖలకు చెందిన సెక్రటరీలను కూడా ఈ సమావేశానికి పిలిచారు. 30 మంది క్యాబినెట్ మంత్రులు, ఐదుగురు స్వతంత్ర స్థాయి సహాయమంత్రులు, 36 మంది సహాయ మంత్రులతోపాటు వారి కార్యదర్శులు హాజరయ్యారు. మోదీ మూడో దఫా పదవీ కాలానికి జూన్ 9తో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పరిపాలనా ప్రాధాన్యతలను నిర్ణయించడం, మంత్రిత్వ శాఖల పనితీరుపై సమీక్షను ఎజెండాగా నిర్ణయించారు.

సుదీర్ఘకాలం సంక్షోభం కొనసాగే అవకాశం

ప్రధాని మోదీ ప్రసంగంతో సమావేశం ప్రారంభమైంది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభంతో ఎదురవుతున్న ఇంధన సమస్య గురించి ప్రధాని వివరించారు. ఈ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగే అవకాశాలున్నాయన్నారు. దేశంలో చమురు, ఇంధన నిల్వలు మరో 5 నెలల వరకు సరిపోతాయని, అయినప్పటికీ రాబోయే పరిణామాలకు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలను తాను అప్రమత్తం చేశానని, అయితే మొత్తం ప్రభుత్వ పనితీరు మారాల్సిన అవసరం ఉన్నదని.. ప్రతి ఒక్కరూ సైనిక క్రమశిక్షణతో పనిచేయాలని, వీలైనంతగా ప్రజాధనాన్ని పొదుపు చేయాలని మోదీ హితవు పలికినట్లు సమాచారం. ప్రపంచ పరిణామాల నేపథ్యంలో దేశం ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులకు కలిసికట్టుగా సమాయత్తం కావాలని, అత్యంత సమర్థవంతంగా పని చేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని మోదీ పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు జాతీయ రోజ్‌గార్ మేళా గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 9.45 గంటల వరకు కొనసాగింది.

మధ్యలో 8.15 గంటల వద్ద కొద్ది సేపు అల్పాహార విరామం తీసుకున్నారు. కాగా, ఈ సమీక్ష ప్రాతిపదికగా త్వరలో భారీ ఎత్తున మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని, సహాయమంత్రులతో సహా దాదాపు 2530 మంది మంత్రులకు ఉద్వాసన తప్పదని, కొత్తవారికి అవకాశం లభిస్తుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నెలాఖరులోపు బీజేపీ ఆఫీసు బేరర్ల నియామకం పూర్తవుతుందని, మంత్రివర్గం నుంచి తప్పించే పలువురికి పార్టీలో బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం. ఆ తర్వాత వెంటనే క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

"ఎవరిది గొడ్డలి పార్టీ..?
ఎవరిది గన్ కల్చర్..?"

వైఎస్సార్ మరణంపై ఇంకా నివృత్తి కాని అనేక అంశాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు."మా చిన్నాన్న వై . ఎస్ . వివేకానంద రెడ్డి హత్య కూడా చంద్రబాబు అధికారంలో ఉండగానే జరిగింది" అన్నారు. "చంపిన వ్యక్తి దస్తగిరి దర్జాగా కారులో తిరుగుతున్నాడు" అంటూ ఆరోపించారు.ఈ సందర్భంగా జగన్ "ఎవరిది గొడ్డలి పార్టీ..? ఎవరిది గన్ కల్చర్..?" అంటూ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, హింసాత్మక ఘటనలు, భద్రతా అంశాలపై కూడా ఆయన స్పందించారు.

స్త్రీ శక్తి థీమ్‌తో... మహానాడు2026

ఈకబురు,,అమరావతి, మే 21:
మహానాడు2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ పొలిట్ బ్యూరో నిర్ణయించింది. 20 తీర్మానాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. గురువారం పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్‌గా జరిగిన ఈ పొలిట్ బ్యూరో భేటీలో సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పాల్గొనగా... వేర్వేరు ప్రదేశాల నుంచి మిగిలిన పొలిట్ బ్యూరో సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో మహానాడు నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయే తీర్మానాలు ప్రవేశపెట్టాలి... తీర్మానాల్లో సారాంశం ఏ విధంగా ఉండాలి.. వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో మొత్తంగా 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరోలో నిర్ణయించారు. వీటిల్లో 10 ఏపీ, 4 తెలంగాణ, 1 అండమాన్ కు సంబంధించి తీర్మానాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 4 ఉమ్మడి తీర్మానాలతో పాటు... అంతిమంగా కీలక రాజకీయ తీర్మానం చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. ఇక 2026 మహానాడును స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని నిర్ణయించడంతో... దాన్ని ప్రతిఫలించేలా మహానాడు ఉండాలని.. అలాగే ప్రసంగాలు ఉండాలని సీఎం ఆదేశించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు, మహిళా సాధికారతకు, వారికి హక్కులు కల్పించే విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారనే అంశాన్ని వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతీ పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపడుతోన్న కార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడులు వంటి వాటిపై కూలంకుషంగా చర్చించాలని సీఎం ఆదేశించారు. ఈ మహానాడులో జరిగిన చర్చతో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై మరోసారి చర్చ జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇక మన దేశంమన బాధ్యత పేరుతో పొదుపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలను, కుట్రలను బహిర్గతం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉండాలని పొలిట్ బ్యూరో అభిప్రాయపడింది. ఇక తెలుగుదేశం చరిత్ర, ఎన్టీఆర్ సిద్ధాంతాలపై నేటి తరానికి తెలిసేలా మహానాడులో ప్రజెంటేషన్స్ ఇవ్వనున్నారు. హైబ్రీడ్ పద్ధతుల్లో ఈసారి మహానాడు జరుగుతున్నా... మహానాడు స్ఫూర్తి మాత్రం కొనసాగాలని సీఎం సూచించారు. మహానాడు కార్యక్రమాన్ని పండుగలా చేపట్టాలని పొలిట్ బ్యూరో సమావేశంలో సీఎం చంద్రబాబు సూచించారు. రెండు రోజుల ముందు నుంచి ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగరేయాలన్నారు. పార్టీ అగ్రనాయకత్వం మొదలుకుని క్షేత్ర స్థాయి కార్యకర్త వరకు మహానాడులో భాగస్వాములను చేసేలా నిర్వహించాలని టీడీపీ అధినేత ఆదేశించారు. ఇక అన్ని క్లస్టర్లల్లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు.

బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

ఈకబురు,హైదరాబాద్:
బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు హైకోర్టు అనుమతించింది. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఈనెల 8న పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 15న వాదనలు విన్న హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు ఆయన తరఫున న్యాయవాది అనుమతి కోరారు. న్యాయవాది విజ్ఞప్తి మేరకు హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది

సెన్సెక్స్ 135 పాయింట్లు డౌన్..
బలపడిన రూపాయి



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌పై ఒత్తిడి కారణంగా సూచీలు ప్రభావితమయ్యాయి. ఉదయం లాభాల్లో ట్రేడయిన సూచీలు.. చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి 75,183.36 పాయింట్ల వద్ద ముగియగా.. నిఫ్టీ 4.30 పాయింట్ల నష్టంతో 23,654.70 వద్ద స్థిరపడింది. ఆర్‌బీఐ రంగ ప్రవేశంతో డాలరుతో రూపాయి విలువ 63 పైసలు బలపడి 96.23కు చేరుకుంది. ఉదయం 75,732.42 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,318.39) లాభాల్లో ప్రారంభమైన సూచీ.. ఇంట్రాడేలో 74,996.78 75,945.79 మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఇండిగో, బీఈఎల్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 104 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4518 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

ఈ ఏడాది లేఆఫ్‌లు లేనట్లే.. ఆ ఉద్యోగులకు మెటా ఇచ్చే ప్యాకేజీ ఇదే..!

కృత్రిమ మేధను విస్తృతంగా వినియోగంలోకి తెస్తున్న టెక్ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులకు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా తన వర్క్‌ఫోర్స్‌లో 10 శాతం మందిని తొలగించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. ఈ ఏడాదిలో మరికొంతమందిని తొలగించే అవకాశాలున్నాయని వార్తలు వచ్చాయి. అయితే ఈ ఏడాది మరిన్ని లేఆఫ్‌లు ఉండకపోవచ్చని ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో సీఈఓ జుకర్‌బర్గ్ (Mark Zuckerberg) వెల్లడించారు. ''విజయం దానంతట అది వచ్చేది కాదు. ఏఐ మన జీవితంలో అత్యంత ప్రభావాన్ని చూపించే సాంకేతికత. ఆ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకునే సంస్థలే తర్వాత తరానికి ఒక మార్గం చూపిస్తాయి. ఈ కంపెనీ అభివృద్ధిలో భాగమైన వారికి గుడ్‌బై చెప్పడం ఎప్పుడూ బాధించే విషయమే. అది నేను అనుభవిస్తున్నాను'' అని పేర్కొన్నారు.ఐరోపా, అమెరికా, సింగపూర్‌లలో కొందరు ఉద్యోగులకు 'ఇంటి నుంచి పని' చేసే అవకాశం కల్పించి.. అంతలోనే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు 'ఇమెయిల్' ద్వారా సమాచారాన్ని మెటా (Meta) పంపింది. అదే సమయంలో వారికి ఎంతమేర ప్యాకేజీ ఇస్తున్నారన్న దానిపైనా చర్చ మొదలైంది. అమెరికా వరకు చూస్తే.. లేఆఫ్ అయిన ఉద్యోగికి 16 వారాలకు సమానమైన బేస్ పేతో పాటు ఉద్యోగంలో కొనసాగిన ప్రతి ఏడాదికి రెండు వారాల వేతనాన్ని అందిస్తారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ ఉద్యోగితో పాటు ఆ కుటుంబానికి 18 నెలల హెల్త్‌కేర్ కవరేజ్ అందుతుంది. అమెరికా వెలుపల ఉద్యోగం కోల్పోయిన వారికి అటూఇటూగా ఇలాగే చెల్లించనున్నారు.

'మెలోడీ' జోరు..
'పార్లే'కు హుషారు

ప్రధాని నరేంద్ర మోదీఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ తమ స్నేహానికి గుర్తుగా వాడుతోన్న 'మెలోడీ' పదం మరోసారి ట్రెండింగ్‌లో ఉంది. మెలోనీకి మోదీ.. మెలోడీ చాక్లెట్లు ఇవ్వడమే అందుకు కారణం. ఈ ఇద్దరు నేతలు షేర్ చేసిన వీడియో వైరల్ అవుతుండటంతో వరుసగా రెండోరోజు పార్లే ఇండస్ట్రీస్ షేర్లు అప్పర్‌సర్క్యూట్‌ను తాకాయి. వాస్తవంగా మెలోడీ చాక్లెట్లకు, పార్లే ఇండస్ట్రీస్‌కు ఎలాంటి సంబంధం లేకపోవడం గమనార్హం. మెలోడీ చాక్లెట్లను పార్లే ప్రొడక్ట్స్ సంస్థ తయారుచేస్తోంది. ముంబయి కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఈ కంపెనీ.. స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అవలేదు. ఇప్పుడు మెలోడీ మూమెంట్ వైరల్ అయిన తర్వాత పార్లే పేరు విషయంలో మదుపర్లు ఒకింత గందరగోళానికి గురైనట్లు కనిపిస్తోంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ సంస్థ పార్లే ఇండస్ట్రీస్.. బీఎస్ఈలో లిస్ట్ అయింది. రీసైక్లింగ్ విభాగంలోనూ ఇది కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వరుసగా రెండు రోజులు పార్లే షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకినప్పటికీ.. సంస్థ ట్రేడింగ్ హిస్టరీ తీసుకుంటే ఈ స్టాక్స్ కొంతకాలంగా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కానీ ఈ సంస్థ షేరు విలువ గత మూడు నెలల్లో 35 శాతం, ఈ ఏడాది ప్రారంభం నుంచి 41 శాతం మేర పతనమైంది.

లోన్ రికవరీకి RBI ప్రతిపాదనలు
.. ఫోన్ బ్లాక్ చేస్తామంటే కుదరదు!

దిల్లీ: రుణాలు తిరిగి చెల్లించని సందర్భంలో వాటిని వసూలు చేసే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. లోన్ల రికవరీ (Loan recovery) పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకులకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. ఈమేరకు 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. దీనిపై మే 31 వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమలు చేయనుంది.

ఫోన్‌పై నియంత్రణకు నో.....

వ్యక్తిగత, కారు, హోమ్‌లోన్ విషయంలో రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్‌ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని పేర్కొంది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్‌ను కొనుగోలు చేయడానికి సదరు బ్యాంకే లోన్ ఇచ్చి ఉంటే, అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. అది కూడా సదరు లోన్ బకాయి పడి 90 రోజుల గడువు దాటి ఉండాలి. కస్టమర్‌లకు నోటీసులు ఇచ్చినా స్పందించని సందర్భాల్లోనే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ.. ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయకూడదని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాలి.

ఏజెంట్ల మాటలు రికార్డ్..

లోన్ రికవరీ కోసం బ్యాంక్ ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు చేసే అన్ని కాల్స్ సమయం, నంబర్లను రికార్డ్ చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. అలాగే వారు చేసే ఆడియో, టెక్స్ట్ సంభాషణలను భద్రపరచాలని బ్యాంకులకు సూచించింది. రుణాల వసూళ్లలో లోన్ ఏజెంట్లు/ఉద్యోగులు అసభ్య పదజాలం, బెదిరింపులకు దిగడం వంటివి చేయకూడదని స్పష్టంచేసింది. కస్టమర్ల వ్యక్తిగత వివరాలు, ఆడియో/ వీడియో రికార్డులను సోషల్‌మీడియాలో పెట్టడం, సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, కాల్స్ చేసి పదేపదే వేధించడం వంటివి చేయకూడదని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

₹11 వేల కోట్లతో జెప్టో ఐపీఓ.. త్వరలో వచ్చేందుకు సన్నాహాలు

ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సిద్ధమవుతోంది. జులైలో రూ.11 వేల కోట్లను మార్కెట్ నుంచి సమీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. జులై 31లోపు పబ్లిక్ ఇష్యూకు రావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన అప్‌డేటేడ్ ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఓకు వచ్చేందుకు కాన్ఫిడెన్షియల్ రూట్‌లో గతేడాది డిసెంబర్‌లో సెబీకి ముసాయిదా పత్రాలను జెప్టో సమర్పించింది. దీనివల్ల పోటీదారులకు మేలు చేకూర్చే సున్నిత సమాచారమేది బయటకు రాదు. ఐపీఓ దరఖాస్తు చేసుకున్నా తర్వాత ఏమైనా అభ్యంతరాలుంటే సెబీ తెలియజేస్తుంది. అందుకు అవసరమైన పత్రాలను మరోసారి కంపెనీ సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఇప్పటికే జెప్టోకు ప్రత్యర్థులైన బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ పేరెంట్ కంపెనీ స్విగ్గీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి.2020లో అదిత్‌పలిచా, కైవల్య వోహ్రా తొలుత కిరాణాకార్ట్ పేరుతో జెప్టోను స్థాపించారు. 45 నిమిషాల్లో డెలివరీ సేవలకు శ్రీకారం చుట్టారు. తర్వాత సొంతంగా డార్క్ స్టోర్లు ఏర్పాటు చేసుకుని 10 నిమిషాల్లో డెలివరీ సేవలను ప్రారంభించారు. అదే తర్వాతి కాలంలో జెప్టోగా మారింది. తొలుత ముంబయిలో ఈ సేవలను ప్రారంభించారు. తర్వాత దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాలకు విస్తరించారు. క్విక్‌కామర్స్ సెగ్మెంట్‌లో అత్యధిక డార్క్ స్టోర్‌లు ఉన్న సంస్థగా జెప్టో నిలిచింది. దేశంలోని 61 నగరాల్లో 1225 డార్క్ స్టోర్లు ఉన్నట్లు ఇటీవల బ్రోకరేజీ సంస్థ బెర్న్‌స్టెయిన్ సంస్థ పేర్కొంది. నగరాల్లో సగటున 21 స్టోర్లను జెప్టో నిర్వహిస్తుండగా.. పోటీ సంస్థలు 9 మాత్రమే నిర్వహిస్తున్నాయి.

ఐపీవోకు స్పేస్‌ఎక్స్.. ప్రపంచ తొలి ట్రిలియనీర్ కానున్న మస్క్..!

అమెరికా బిజినెస్ టైకూన్ ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ వాల్‌స్ట్రీట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూకు రంగం సిద్ధం చేసింది. ఈ ఐపీవో వచ్చేనెల SPCX అనే టికర్ సింబల్‌తో ఆరంభం కావచ్చు. ఇప్పటికే ఐపీవోకు సంబంధించిన ఫైలింగ్‌ను ఈ సంస్థ పూర్తి చేసింది. స్పేస్ ఎక్స్‌లో ఎలాన్ మస్క్‌కు భారీ సంఖ్యలో వాటాలున్నాయి. ఈ ఐపీవోతో అతడు బిలియనీర్ హోదా నుంచి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ (లక్ష కోట్ల డాలర్లకు అధిపతి)గా ఘనత సాధించే అవకాశం ఉంది. స్పేస్‌ఎక్స్ విలువే 1.25 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. దీనిలో మస్క్ వాటాలు 600 బిలియన్ డాలర్లను దాటిపోయాయి. గతేడాది మస్క్ 500 బిలియన్ డాలర్ల సంపద ఉన్న వ్యక్తిగా రికార్డు సృష్టించారు. తాజాగా టెస్లా లిస్టింగ్‌తో అతడి సంపద ట్రిలియన్ డాలర్లను దాటిపోతుంది. గతేడాది స్పేస్‌ఎక్స్ ఎక్స్‌ప్లొరేషన్ టెక్నాలజీస్ అధికారికంగా 18.6 బిలియన్ డాలర్లు ఆదాయం సంపాదించగా.. 4.9 బిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసింది. స్పేస్ ఎక్స్ వద్ద రాకెట్లు, ఇతర పరికరాల రూపంలో 102 బిలియన్ డాలర్ల ఆస్తులున్నాయి. అదే సమయంలో 60.5 బిలియన్ డాలర్ల అప్పులు కూడా ఉన్నాయి. దీంతోపాటు దాదాపు అర్ధ బిలియన్ డాలర్ల విలువైన న్యాయపోరాటాలను ఎదుర్కొంటోంది. గ్రోక్ వంటి వాటిపై కేసులు ఉన్నాయి. దీంతోపాటు సోషల్ మీడియా వేదిక ఎక్స్ యజమాని కూడా స్పేస్ ఎక్సే.

ఓపెన్ ఏఐ కూడా ఐపీవోకు..

మరోవైపు చాట్ జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐ కూడా ఐపీవోకు వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకొంది. ఇది కూడా వాల్‌స్ట్రీట్ నుంచి వచ్చిన అతిపెద్ద ఐపీవోల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే ఓపెన్ ఏఐ విలువను ప్రైవేటు ఇన్వెస్టర్లు 850 బిలియన్ డాలర్లుగా లెక్కించారు. గోల్డ్‌మన్‌శాక్స్, మోర్గాన్ స్టాన్లీ వంటి బ్యాంకులతో ఫైలింగ్ కోసం సన్నాహాలు చేస్తోంది. ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో ఐపీవో మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. ఓపెన్ ఏఐ వంటి సంస్థ ఓ పబ్లిక్ కంపెనీలా కనిపించడం, ప్రవర్తించడం మంచిదని దాని సీఎఫ్‌వో సారా ఫ్రెయిర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దీనిని బలోపేతం చేస్తున్నాయి.

మారుతీ సుజుకీ ధరల షాక్
.. రూ.30వేల వరకు పెంపు

దిల్లీ: ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ (Maruti Suzuki) వినియోగదారులకు షాక్ ఇచ్చింది. అన్ని మోడళ్లపై రూ.30వేల వరకు ధరలు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. జూన్ నుంచి ఈ పెంపు చేపట్టనున్నట్లు వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించింది. గడిచిన కొన్ని నెలలుగా ఖర్చుల ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీ ప్రయత్నాలు చేస్తూనే ఉందని, అనివార్య పరిస్థితుల్లో వినియోగదారులపై అధిక ప్రభావం పడకుండా ఆ భారాన్ని బదిలీ చేయాల్సి వస్తోందని ఓ ప్రకటనలో వెల్లడించింది.మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు వివిధ మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.3.49 లక్షల నుంచి ప్రారంభమై రూ.28.7 లక్షల వరకు ఉన్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో జీఎస్టీ 2.0 నిర్ణయం కారణంగా ఆయా కార్ల ధరలు భారీగా తగ్గాయి. ఎస్-ప్రెస్సో రూ.1.29 లక్షలు, ఆల్టో కే10పై రూ.1.07 లక్షలు, సెలిరియో రూ.94వేలు, వ్యాగనార్‌పై రూ.79 వేల చొప్పున తగ్గాయి. తాజా పెంపు నిర్ణయంతో వాటి ధరలు గరిష్ఠంగా రూ.30వేల వరకు పెరగనున్నాయి.

ఒప్పో ఫైండ్ X9 సిరీస్‌లో రెండు కొత్త ఫోన్లు..
అల్ట్రా రూ.లక్షన్నర పైనే!

చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ ఒప్పో ఫైండ్ ఎక్స్ 9 సిరీస్‌లో రెండు స్మార్ట్‌ఫోన్లను దేశీయ మార్కెట్‌లో లాంచ్ చేసింది. ఒప్పో ఫైండ్ X9s(Oppo Find X9s), X9 Ultra (Oppo Find X9 Ultra)పేరిట వీటిని విడుదల చేసింది. X9 Ultra ప్రీమియం మోడల్‌గా తీసుకొచ్చారు. ఈ ఫోన్లు ఇప్పటికే గ్లోబల్ మార్కెట్లో లాంచ్ కాగా.. నేడు భారత్‌లో విడుదల చేసింది. ఈ ఫోన్ ఫీచర్లు, ధర వివరాలు పరిశీలిస్తే..

Oppo Find X9 Ultra ఫీచర్లు

ఇందులో 6.82 అంగుళాల క్యూహెచ్‌డీ+ ఫ్లెక్సిబుల్ అమోలెడ్ డిస్ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్‌రేట్, 1,800 నిట్స్‌పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 16తో కూడిన కలర్ ఓఎస్16 ఆధారంగా పనిచేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 ప్రాసెసర్ అమర్చారు. 200 ఎంపీ ఓఐఎస్ ప్రధాన కెమెరా+ 50 ఎంపీ అల్ట్రా వైడ్ కెమెరా+ 200 ఎంపీ టెలిఫొటో కెమెరా + 50 ఎంపీ అల్ట్రా టెలిఫొటో కెమెరా ఇచ్చారు. ముందువైపు 50 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 7,050mAh బ్యాటరీ 100W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ + 50W వైర్‌లెస్ ఛార్జింగ్‌కు సపోర్టు చేస్తుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ 2 ప్రొటెక్షన్ ఇచ్చారు. ఫోన్ బరువు: 235 గ్రాములు.

ధర విషయానికొస్తే.. Oppo Find X9 Ultra స్మార్ట్ ఫోన్‌ను సింగిల్ వేరియంట్‌లో తీసుకొచ్చారు. 12GB+512GB వేరియంట్ ధర రూ.1,69,999గా కంపెనీ నిర్ణయించింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఒప్పో ఆన్‌లైన్ స్టోర్‌లలో ప్రీ బుకింగ్స్ మొదలయ్యాయి. వీరికి రూ.11 వేలు విలువైన ఒప్పో ఎన్కో ఎయిర్ 5 ప్రో టీడబ్ల్యూఎస్ ఇయర్ బడ్స్‌తో పాటు ఒప్పో ఫైండ్ ఎక్స్9 అల్ట్రా కవర్ కేస్ కంపెనీ ఆఫర్ చేస్తోంది. రూ.22 వేల వరకు ఎక్స్ఛేంజీ బోనస్ లభిస్తుంది. ఎంపిక చేసిన బ్యాంకు కార్డు హోల్డర్లకు 24 నెలల పాటు ఉచిత డౌన్‌పేమెంట్ సహా 10 శాతం వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బాక్ అందిస్తామని కంపెనీ తెలిపింది.

Oppo Find X9s ఫీచర్లు

ఈ స్మార్ట్‌ఫోన్‌లో 6.59 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ డిస్ప్లే ఇచ్చారు. 120Hz రిఫ్రెష్ రేట్, 1,800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత కాలర్ ఓఎస్16తో పనిచేస్తుంది. ఒప్పో ఫైండ్ ఎక్స్9ఎస్ ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 9500ఎస్ ప్రాసెసర్ అమర్చారు. 50ఎంపీ ఓఐఎస్ ప్రధాన కెమెరా+ 50 ఎంపీ అల్ట్రావైడ్ కెమెరా+ 50 ఎంపీ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరా+32ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 7,025mAh బ్యాటరీ 80W వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టుతో వస్తోంది. ఐపీ66 +ఐపీ68+ఐపీ69 రేటింగ్ ఉంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7i ప్రొటెక్షన్, ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్ ఇచ్చారు. ఫోన్ బరువు 202 గ్రాములు. లావెండర్ స్కై, మిడ్‌నైట్ గ్రే సన్‌సెట్ ఆరెంజ్ రంగుల్లో లభిస్తుంది.

ధర విషయానికొస్తే.. Oppo Find X9s స్మార్ట్‌ఫోన్ రెండు వేరియంట్‌లో వస్తోంది. 12GB+256GB బేస్ వేరియంట్ ధర రూ.79,999, 12GB + 512GB టాప్ వేరియంట్ ధర రూ.89,999గా కంపెనీ నిర్ణయించింది. ఎంపిక చేసిన కార్డు హోల్డర్లకు 10 శాతం ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్, రూ.5వేల ఎక్స్ఛేంజీ బోనస్‌ను కంపెనీ ఆఫర్ చేస్తోంది. 24 నెలల నోకాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. మే 28 నుంచి అమెజాన్, ఒప్పో ఆన్‌లైన్ స్టోర్‌లో విక్రయాలకు రానుంది.

ఎప్పుడూ అదే పక్షపాత ధోరణి

కథానాయకులు ప్రధాన పాత్రలు పోషించే చిత్రాలకు లభించే బడ్జెట్‌లు, మద్దతు లాంటివి నాయికా ప్రాధాన్య ప్రాజెక్టులకు దొరకవంటోంది బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవంలో పాల్గొన్నారీమె. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో చిత్రపరిశ్రమ గురించి మాట్లాడారు. ''మనది చాలా వైవిధ్యమైన దేశం. మనదైన శైలిలో మహిళా ప్రాధాన్య కథలను రూపొందించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి రీమేక్‌లు చేయకుండా.. ఒరిజినల్ కంటెంట్‌ను రూపొందించాలి. మన పురాణాలు, సంస్కృతులపై కూడా దృష్టిపెడతారని ఆశిస్తున్నా. హీరోలకు లభించే బడ్జెట్‌లు మాకు లభించవు. మహిళా చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద ఒక నిర్దిష్ట సామర్థ్యం మాత్రమే ఉంటుందనే పక్షపాత ధోరణి ఇండస్ట్రీలో ఎప్పుడూ ఉంటుంది. ఈ రోజుల్లో కూడా అలా ఉంటుందా అంటే బహుశా దాని గురించి ఎవరూ అంతగా మాట్లాడకపోయి ఉండొచ్చు. అంతేకానీ, లేదని మాత్రం కాదు. ప్రస్తుతం నేను కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాను. ఇది నిరంతరం ఎదుర్కోవాల్సినదే. దానిని అధిగమించడానికి ఏకైక మార్గం ముందుకు సాగిపోతూ పని చేస్తూ ఉండడమే. నేను మాత్రమే కాదు నా తోటి నటీమణులు చాలా మంది.. తమ కెరీర్‌లో తమ కోసమే కాకుండా భవిష్యత్తులో తమ తర్వాత వచ్చే అనేక మంది కోసం వాస్తవ పరిస్థితిని మార్చడానికి నిరంతరం కృషి చేస్తూ ఆ పరిమితులను దాటుతున్నారనే భావిస్తున్నాన''ని అన్నారు. హ్యూమా ప్రస్తుతం యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంలో నటిస్తోంది.

సందడిగా చిరంజీవి 158వ చిత్రం ప్రారంభం

అగ్ర కథానాయకుడు చిరంజీవి కొత్త చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆయన సోదరులు నాగబాబు, పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథులుగా ప్రారంభోత్సవానికి హాజరు కావడంతో, ముగ్గురు మెగా సోదరులు ఒకే వేదికను పంచుకోవడం అభిమానుల్ని ప్రత్యేకంగా ఆకర్షించింది. విజయవంతమైన 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి బాబీ కొల్లి కలయికలో రూపొందుతున్న చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. పలు భాషల్లో సినిమాల్ని నిర్మిస్తున్న ఈ నిర్మాత తొలి తెలుగు చిత్రమిదే. అనశ్వర రాజన్ కీలక పాత్రలో నటించనున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు పవన్‌కల్యాణ్ క్లాప్‌నివ్వగా, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల కెమెరా స్విచ్చాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. సీనియర్ దర్శకులు బి.గోపాల్, కోదండరామిరెడ్డితో కలిసి నాగబాబు చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. సందడిగా సాగిన ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు.

చిరంజీవి తన కెరీర్‌లోనే అత్యంత శక్తిమంతమైన పాత్రని ఇందులో పోషిస్తున్నారని, దర్శకుడు బాబీ కొల్లి ఈసారి మరింత విస్తృతమైన పరిధి ఉన్న కథని సిద్ధం చేశారని సినీ వర్గాలు తెలిపాయి. ఈ సినిమా కోసం చిరంజీవి శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధం అవుతున్నారు. శుక్రవారం నుంచే రెగ్యులర్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ సినిమా ప్రారంభోత్సవం తర్వాత చిరంజీవి ఎక్స్‌లో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు. ''ఈరోజు కల్యాణ్ బాబుకీ, నాకూ మధ్యలో క్లాప్ బోర్డ్ కనిపిస్తుంటే... ముప్పయ్యేళ్ల కిందట ఇదే సన్నివేశం రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకొస్తోంది. సమయం తీసుకుని ఉప ముఖ్యమంత్రి హోదాలో నా 158వ సినిమా ప్రారంభోత్సవంలో పాల్గొని క్లాప్ కొట్టినందుకు కృతజ్ఞతలు. కల్యాణ్‌కు ప్రేమతో'' అంటూ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు చిరంజీవి. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా పరిచయమైన 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమా చిరంజీవి క్లాప్‌తో ప్రారంభమైంది. ఆ సందర్భాన్నే గుర్తు చేసుకుంటూ ఆ పోస్ట్‌ని పంచుకున్నారు చిరంజీవి. ఈ కొత్త చిత్రానికి సంగీతం: తమన్, స్క్రీన్ ప్లే: కోన వెంకట్, కె.చక్రవర్తి రెడ్డి, ఛాయాగ్రహణం: విజయ్ కార్తీక్ కన్నన్, కూర్పు: ఆంటోనీ రూబెన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా,

కోలీవుడ్ కాలింగ్?

జాన్వీ కపూర్ కోలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రముఖ హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా కరణ్ అరవింద్ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమాకి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ద్విభాషా (తమిళ, తెలుగు) చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారని సమాచారం. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు జాన్వీ కపూర్‌ను అను కుంటున్నారట.

మరి... ఈ సినిమాతోనే జాన్వీ కోలీవుడ్ ఎంట్రీ ఉంటుందా? ధ్రువ్–జాన్వీల జోడీ కన్ఫార్మ్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు మేకర్స్ తొలుత రుక్మిణీ వసంత్‌ని అనుకున్నారట. కాల్షీట్స్ సర్దుబాటు చేయడంలో రుక్మిణీకి ఇబ్బందులు తలెత్తడంతో జాన్వీని తీసుకుంటున్నారని చెన్నై టాక్.

జాన్వీ

చిత్ర నిర్మాణం... ఓ కృతజ్ఞత లేని పని

నిర్మాతగా ఉండడమనేది.. కృతజ్ఞత లేని పనిగా అనిపించిందంటున్నారు బాలీవుడ్ అగ్రహీరో సైఫ్ అలీఖాన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన సొంత బ్యానర్ ఇల్యూమినాటి ఫిల్మ్‌స్‌ని మూసివేయడానికి గల కారణాన్ని పంచుకున్నారు. "సినిమాలు నిర్మించడమనేది చాలా సృజనాత్మకమైనది. ఈ ప్రయాణంలో ఒక ఆలోచన రావడం.. అది కార్యరూపం దాల్చేందుకు సృజనాత్మక విషయాల గురించి చర్చించడం అనే భావన నాకు నచ్చింది. చిత్రాల నిర్మాణాన్ని ఆస్వాదించాను. కానీ, కొన్నిసార్లు అది చాలా పెద్ద తలనొప్పి కూడా కావచ్చు. చిత్ర నిర్మాణం... కృతజ్ఞత లేని పనిలా అనిపించింది. పరిస్థితులు మారతాయి. మనుషులు మారుతున్నారు. ఇది అన్ని చోట్ల జరుగుతుంది. నేను నిర్మాత దినేష్ విజన్ కలిసి సినిమాల్ని రూపొందించాం. ఇప్పుడొక అతనొక అద్భుతమైన నిర్మాతగా ఎదిగారు. అది చాలా గొప్ప విషయం. మేం కలిసి పనిచేసినప్పుడు మా సమయం మాకు దక్కేది. దాని వల్ల నేను చాలా లాభపడ్డాను. కానీ, కొన్ని విషయాలు కొంతకాలమే నిలిచి ఉంటాయ"ని అన్నారు. 2009లో సైఫ్ ఇల్యూమినాటి ఫిల్మ్స్ అనే నిర్మాణసంస్థను స్థాపించి 'లవ్ ఆజ్ కల్', 'కాక్‌టెయిల్' లాంటి చిత్రాలకు దినేష్ విజన్‌తోపాటు నిర్మాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'కర్తవ్య' చిత్రంలో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

ఆ సమయంలో కెమెరా ముందుకు రాగానే వణుకొచ్చేసేది

హిందీ సినిమా.. ముఖ్యంగా ఓటీటీ రంగం.. 40ఏళ్లు పైబడిన మహిళలకు గొప్ప పాత్రలను అందిస్తుందని అంటోంది నటి జ్యోతిక. ప్రేమకథలు, కామెడీ.. ఇలా విభిన్నమైన జానర్లని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న కథానాయికీమె. గతేడాది 'డబ్బా కార్టెల్'తో ఓటీటీ వేదికగా మెప్పించిన ఈమె.. ఇప్పుడు 'సిస్టమ్' చిత్రంతో ఆకట్టుకోవడానికి సిద్ధమైంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. హిందీ చిత్రపరిశ్రమ, తన వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

''సిస్టమ్' అనే లీగల్ డ్రామాలో నేను నటించిన పాత్ర చాలా ఆసక్తికరంగా.. భావోద్వేగపరంగా సవాలుగా అనిపించింది. కోర్టు గదిలోని ప్రతి కదలికను అర్థం చేసుకునే వ్యక్తి ఆమె. ఈ పాత్రలో డైలాగులు చాలా తక్కువ. కానీ కళ్లతోనే ఎన్నో భావాలను పలికించే అవకాశం ఈ పాత్రతో లభించింది. అందుకే ఈ పాత్ర నన్ను బాగా ఆకర్షించింది. మాటలు లేకుండా భావోద్వేగాలు వ్యక్తపరచడం కష్టమైనప్పటికీ.. అది ఎంతో సంతృప్తినిచ్చింది. దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీతో పనిచేయడం ఎప్పుడూ చాలా సౌకర్యంగా ఉంటుంది''.

ఇది ఉత్తేజకరమైన దశ

''బాలీవుడ్‌లో కథ చెప్పే విధానంలో వస్తోన్న మార్పులు చూస్తుంటే సంతోషంగా ఉంది. ముఖ్యంగా మహిళల కోసం విభిన్న పాత్రలు రాయడం, సవాలుతో కూడిన కథల్లో వారిని ఎంపిక చేసుకోవడం నేను చూస్తున్నాను. ఇది నటీమణులకు ఒక ఉత్తేజకరమైన దశ. వైవిధ్యమైన జానర్లలో మహిళల కోసం కథలు సిద్ధం చేస్తున్నారు. ఇది మమ్మల్ని ప్రోత్సహించినట్లుగా అనిపిస్తుంది. భవిష్యత్తులో కూడా అన్ని పరిశ్రమలు ఈ బాటలోనే సాగాలని ఆశిస్తున్నా''.

అందుకే తమిళ పరిశ్రమకు వెళ్లా

''వ్యక్తిగత జీవితం వల్ల అప్పట్లో సినిమాల నుంచి సుదీర్ఘ విరామం తీసుకున్నా. మళ్లీ కెమెరా ముందుకు రాగానే నాలో ఒక రకమైన భయం, వణుకు వచ్చేది. కొన్నేళ్ల తర్వాత మళ్లీ సెట్‌స్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఆందోళన కలగడం సహజమే. అంతా మొదటి నుంచి ప్రారంభించినట్లు అనిపించింది. ఆ సమయంలో కేవలం నటన మాత్రమే కాదు భాష కూడా సవాలుగా మారింది. 1998లో 'డోలీ సజా కే రఖ్నా' అనే హిందీ చిత్రంతో నటిగా వెండితెరకు పరిచయమయ్యా.

ఆ సినిమా వైఫల్యమే నన్ను తమిళ చిత్రపరిశ్రమ వైపు నడిపించింది. బాక్సాఫీస్ వద్ద నా మొదటి సినిమా సరిగ్గా ఆడకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నా. కానీ చివరికి చెన్నై నాకు కావాల్సిన దాని కన్నా ఎక్కువే ఇచ్చింది''.

ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం

''దక్షిణాది సినిమాలకు, హిందీ కంటెంట్‌కు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. దక్షిణాది చిత్రాలు థియేటర్లలో విజయవంతంగా కొనసాగుతున్నప్పటికీ.. అక్కడి పాత్రలు ఇప్పటికీ చాలా వరకు హీరో ప్రధానంగానే రూపు దిద్దుకుంటున్నాయి. సౌత్‌లో నేను ప్రతి సినిమాను ఇష్టంతోనే చేశాను... ఇకపై చేస్తాను కూడా. కానీ బాలీవుడ్ చిత్రాలు.. మహిళలకు కొత్త కోణాలున్న పాత్రల్ని అందుబాటులోకి తీసుకొస్తున్నాయి''.

వినాయక చవితికి జైలర్ 2!

"టైగర్ కా హుకుం".. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.

నితీశ్ వేగం వెనుక...

బెంగళూరు: తెలుగబ్బాయి నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో వేగం పెరిగింది.. కచ్చితత్వం పెరిగింది.. ఈ ఐపీఎల్‌లో అతడి బౌలింగ్ అందరినీ ఆకట్టుకుంటోంది. టెస్టు జట్టుతో పాటు.. వన్డే జట్టులో చోటు దక్కడానికి కారణం కూడా అతడి బౌలింగ్‌లో కొత్తగా వచ్చిన మార్పేనని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అన్నాడు. అఫ్గానిస్థాన్‌కు ఎంపిక చేసిన టెస్టు, వన్డే జట్లలో నితీశ్ చోటు దక్కించుకున్నాడు. ఇంతకి నితీశ్ బౌలింగ్‌లో వచ్చిన మార్పు ఏంటి. అందుకు కారణమైన ప్రముఖ ఫాస్ట్ బౌలింగ్ కోచ్ స్టీఫన్ జోన్స్ వివరించాడు. "ఫాస్ట్ బౌలింగ్ అంటే భుజ బలానికి సంబంధించిన విషయం కాదు. బుర్రకు సంబంధించింది. కొన్ని శిక్షణ పద్ధతుల ద్వారా నితీశ్ బౌలింగ్‌కు వేగాన్ని అందించాం. ఏడు రోజులు పాటు నితీశ్ కఠోర సాధన చేశాడు. ఈ క్రమంలో అతడి రనప్ మార్చా. నితీశ్‌ను వీలైనంత వేగంగా, నేరుగా పరుగెత్తేలా చేశాను. కాస్త జోఫ్రా ఆర్చర్ శైలిని అనుసరించేలా చేశాను. అతడు శరీరాన్ని ఎక్కువ ఉపయోగించేలా చేశాను. శిక్షణ వల్ల అతడి బౌలింగ్ ఎంతో మెరుగైంది" అని జోన్స్ వివరించాడు.

చెన్నై కథ ముగిసె.. టైటాన్స్ చేతిలో చిత్తు

ఐపీఎల్ 19లో చెన్నై కథ ముగిసింది. మిణుకుమిణుకుమన్న ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పక నెగ్గాల్సిన తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో సూపర్‌కింగ్స్ చిత్తుగా ఓడిపోయింది. బ్యాటుతో, బంతితో సీఎస్కే తేలిపోయింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన టైటాన్స్.. టాప్2 స్థానాన్ని సొంతం చేసుకున్నట్లే. 9వ విజయంతో పాటు గుజరాత్ రన్‌రేట్‌ను భారీగా పెంచుకుంది. సుదర్శన్, గిల్, బట్లర్ ధనాధన్ బ్యాటింగ్‌తో సీఎస్కేను హడలెత్తిస్తే.. సిరాజ్ సూపర్ బౌలింగ్‌తో ఆ జట్టు వెన్నువిరిచాడు.

గుజరాత్ టైటాన్స్ చెలరేగిపోయింది. గురువారం అత్యంత ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో 89 పరుగుల తేడాతో చెన్నైని చిత్తు చేసింది. సాయి సుదర్శన్ (84; 53 బంతుల్లో 7×4, 4×6), శుభ్‌మన్ గిల్ (64; 37 బంతుల్లో 7×4, 3×6), బట్లర్ (57 నాటౌట్; 27 బంతుల్లో 5×4, 4×6) విరుచుకుపడడంతో మొదట గుజరాత్ 4 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఛేదనలో సీఎస్కే చేతులెత్తేసింది. 13.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. శివమ్ దూబె (47; 17 బంతుల్లో 4×4, 4×6) టాప్‌స్కోరర్. సిరాజ్ (3/26), రబాడ (3/32), రషీద్ ఖాన్ (3/18) అద్భుత బౌలింగ్‌తో ఆ జట్టు పతనాన్ని శాసించారు. అన్ని మ్యాచ్‌లూ ఆడిన చెన్నై.. టోర్నీని ముగించింది.

తేలిపోయిన చెన్నై: ఛేదనలో చెన్నై పూర్తిగా తేలిపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన ఆ జట్టు ఏ దశలోనూ గెలిచేలా కనపడలేదు. ఇన్నింగ్స్ 14వ ఓవర్ వరకు సాగినా.. సీఎస్కే ఓటమి ఇంకా చాలా ముందే ఖరారైంది. కొండంత ఛేదనలో తొలి బంతికే సంజు శాంసన్ వికెట్‌ను కోల్పోవడం ఆ జట్టు ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసింది. దూరంగా వెళ్తున్న సిరాజ్ ఔట్ స్వింగర్‌ను ఆడబోయిన శాంసన్.. ఎడ్జ్‌తో వికెట్‌కీపర్ బట్లర్‌కు దొరికిపోయాడు. సిరాజ్ తన తర్వాతి ఓవర్లో రుతురాజ్ (16), ఉర్విల్ పటేల్ (0) లను ఔట్ చేసి, చెన్నైని కోలుకోలేని దెబ్బతీశాడు. 29/3తో ఆ జట్టు చిక్కుల్లో పడింది. ధాటిగా ఆడిన ఓపెనర్ షార్ట్ (24).. మరీ ఎక్కువసేపేమీ నిలవలేదు. రబాడ అతణ్ని వెనక్కి పంపాడు. వెంటనే కార్తీక్ శర్మ (19) కూడా రనౌట్ కావడంతో చెన్నై ఏడు ఓవర్లలో 63/5తో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. అప్పటికే గుజరాత్ విజయం దాదాపుగా ఖాయమైపోయింది. ఆ దశలో దూబె విధ్వంసక బ్యాటింగ్‌తో చకచకా నాలుగు ఫోర్లు, నాలుగు సిక్స్‌లు బాది చెన్నైకి ఊరటనిచ్చి, మ్యాచ్‌లో కాస్త ఆసక్తిని నింపాడు. పదో ఓవర్లో స్కోరు 100 దాటింది. కానీ తర్వాతి ఓవర్లోనే దూబె వెనుదిరిగాడు. ఆ తర్వాత చెన్నై ఓటమి లాంఛనమే. కాంబోజ్ (19) కొన్ని షాట్లు బాదడంతో ఓ దశలో 136/6తో నిలిచిన ఆ జట్టు.. రషీద్ ఖాన్, రబాడ విజృంభించడంతో నాలుగు పరుగుల వ్యవధిలో చివరి నాలుగు వికెట్లు కోల్పోయింది. బ్రెవిస్ (8) విఫలమయ్యాడు.

గుజరాత్ ధనాధన్:

అంతకుముందు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న చెన్నై.. చింతించక తప్పలేదు. ధాటిగా మొదలెట్టిన గుజరాత్.. ఏ దశలోనూ ఊపు తగ్గకుండా ఇన్నింగ్స్‌ను ముగించింది. టాప్ ఆర్డర్ విధ్వంసంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది. చెలరేగి ఆడిన ఓపెనర్ శుభ్‌మన్ గిల్ గుజరాత్‌కు అదిరే ఆరంభాన్నిచ్చాడు. మరో ఓపెనర్ సాయి సుదర్శన్ ఎక్కువగా స్ట్రైక్ రొటేషన్‌కే పరిమితమైనా.. గిల్ విధ్వంసంతో టైటాన్స్ ఇన్నింగ్స్ జోరుగా సాగింది. 7 ఓవర్లకు స్కోరు 78/0. ముకేశ్ బౌలింగ్‌లో గ్లాన్స్‌తో ఫోర్ కొట్టి ఖాతా తెరిచిన గిల్... ఆ తర్వాత కూడా చక్కని షాట్లతో బౌండరీలు కొట్టి అలరించాడు. నూర్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్లో మిడ్‌వికెట్ మీదుగా రెండు సిక్స్‌లు బాదిన అతడు 23 బంతుల్లోనే అర్ధశతకాన్ని అందుకున్నాడు. సుదర్శన్‌లో మాత్రం ఆ దూకుడు కొరవడింది. ఎదుర్కొన్న తొలి 23 బంతుల్లో అతడు 25 పరుగులే చేయగలిగాడు. కానీ క్రమంగా అతడు కూడా గేర్ మార్చాడు. కాంబోజ్ ఓవర్లో సిక్స్, ఫోర్ దంచిన అతడు.. 12వ ఓవర్లో అర్ధశతకం పూర్తి చేశాడు. ఇది అతడికి వరుసగా అయిదో ఐపీఎల్ అర్ధసెంచరీ కావడం విశేషం. అయితే తర్వాతి ఓవర్లో గిల్‌ను నూర్ ఔట్ చేయడంతో ఎట్టకేలకు తొలి వికెట్ భాగస్వామ్యాన్ని (125) సీఎస్కే విడదీయగలిగింది. అయినా ఆ జట్టుకు ఉపశమనం లేదు. క్రీజులోకి వచ్చిన బట్లర్ కూడా ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరు బోర్డును నడిపించాడు.

నూర్ ఓవర్లో రెండు సిక్స్‌లు బాదేశాడు. మరోవైపు సుదర్శన్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో 17 ఓవర్లు ముగిసే సరికి 186/1తో నిలిచింది గుజరాత్. ఆఖరి మూడు ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయిన టైటాన్స్.. మరో 43 పరుగులు సాధించింది. 23 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన బట్లర్ అజేయంగా నిలిచాడు. పేలవంగా బౌలింగ్ చేసిన అన్షుల్ కాంబోజ్.. నాలుగు ఓవర్లలో 56 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు. ఈ ఐపీఎల్‌లో తొలి 9 మ్యాచ్‌ల్లో 31.4 ఓవర్లలో 8.49 ఎకానమీతో 269 (10 సిక్స్‌లు) పరుగులిచ్చి, 17 వికెట్లు పడగొట్టిన కాంబోజ్.. ఆ తర్వాత గతి తప్పాడు. గత అయిదు మ్యాచ్‌ల్లో అతడు 18.4 ఓవర్లలో ఏకంగా 261 పరుగులిచ్చి నాలుగు వికెట్లు మాత్రమే చేజిక్కించుకున్నాడు. ఎకానమీ 13.98. ఈ అయిదు మ్యాచ్‌ల్లో అతడు 24 సిక్స్‌లు ఇవ్వడం గమనార్హం. మొత్తంగా ఓ ఐపీఎల్‌లో సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు (34) ఇచ్చిన బౌలర్‌గా అవాంఛనీయ రికార్డును కాంబోజ్ సొంతం చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

గుజరాత్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) షార్ట్ (బ) కాంబోజ్ 84; శుభ్‌మన్ గిల్ (సి) దూబె (బ) జాన్సన్ 64; బట్లర్ నాటౌట్ 57; తెవాతియా రనౌట్ 0; సుందర్ (సి) ఉర్విల్ (బ) ముకేశ్ 7; ఎక్స్‌ట్రాలు 17 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 229; వికెట్ల పతనం: 1-125, 2-207, 3-207, 4-229; బౌలింగ్: ముకేశ్ చౌదరి 4-0-36-1; జాన్సన్ 4-0-47-1; గుర్జప్‌నీత్ 4-0-31-0; కాంబోజ్ 4-0-56-1; నూర్ అహ్మద్ 3-0-41-0; శివమ్ దూబె 1-0-15-0

చెన్నై ఇన్నింగ్స్: శాంసన్ (సి) బట్లర్ (బ) సిరాజ్ 0; షార్ట్ (సి) ప్రసిద్ధ్ (బ) రబాడ 24; రుతురాజ్ (బ) సిరాజ్ 16; ఉర్విల్ (సి) ప్రసిద్ధ్ (బ) సిరాజ్ 0; కార్తీక్ రనౌట్ (గిల్) 19; బ్రెవిస్ (సి) హోల్డర్ (బ) రషీద్ 8; దూబె (సి) గిల్ (బ) రషీద్ 47; కాంబోజ్ (సి) హోల్డర్ (బ) రషీద్ 19; నూర్ (సి) అండ్ (బ) రబాడ 1; ముకేశ్ నాటౌట్ 2; స్పెన్సర్ (సి) బట్లర్ (బ) రబాడ 0; ఎక్స్‌ట్రాలు 4, మొత్తం: (13.4 ఓవర్లలో ఆలౌట్) 140; వికెట్ల పతనం: 1-0, 2-29, 3-29, 4-51, 5-63, 6-116, 7-136, 8-138, 9-140; బౌలింగ్: సిరాజ్ 3-0-26-3; రబాడ 3.4-0-32-3; అర్షద్ 2-0-24-0; హోల్డర్ 2-0-27-0; రషీద్ 2-0-18-3; ప్రసిద్ధ్ 1-0-13-0

ఐఎస్ఎల్ ఛాంప్ ఈస్ట్ బెంగాల్

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో ఈస్ట్ బెంగాల్ ఛాంపియన్‌గా నిలిచింది. 22 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆ జట్టు ఓ జాతీయ టైటిల్‌ను సొంతం చేసుకుంది. గురువారం జరిగిన ఫైనల్లో ఈస్ట్ బెంగాల్ 2-1తో ఇంటర్ కాశీపై విజయం సాధించింది. మ్యాచ్‌లో ఆరంభం మాత్రం ఇంటర్ కాశీదే. 14వ నిమిషంలో అల్ఫ్రెడ్ ప్లానాస్ చేసిన గోల్‌తో ఆ జట్టు ఆధిక్యంలో నిలిచింది. కానీ రెండో అర్ధంలో ఈస్ట్ బెంగాల్ గొప్పగా పుంజుకుంది. యూసెఫ్ (49వ) గోల్‌తో స్కోరు సమం చేసిన ఆ జట్టు.. తర్వాత రషీద్ (72వ) బంతిని నెట్‌లోకి పంపడంతో మ్యాచ్‌తో పాటు టైటిల్‌ను సొంతం చేసుకుంది. 2004లో చివరగా ఈస్ట్ బెంగాల్ జాతీయ ఫుట్‌బాల్ లీగ్ టైటిల్ గెలిచింది. చాన్నాళ్ల తర్వాత ఈస్ట్ బెంగాల్ విజేతగా నిలవడంతో అభిమానులు మైదానంలోకి దూసుకొచ్చి సంబరాలు చేసుకున్నారు

అందరి దృష్టి కోహ్లిపైనే

హైదరాబాద్: ఐపీఎల్ 19వ సీజన్ లీగ్ దశను అగ్రస్థానంతో ముగించాలనే లక్ష్యంతో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు తమ ఆఖరి మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. ఉప్పల్ స్టేడియంలో నేడు జరిగే మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో ఆర్‌సీబీ తలపడనుంది. టాప్–2లో నిలిచి ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలను సంపాదించాలని సన్‌రైజర్స్ కూడా భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే మ్యాచ్ రెండు జట్లకు కీలకంగా మారగా... అందరి దృష్టి మాత్రం ఆర్‌సీబీ సూపర్ స్టార్ విరాట్ కోహ్లిపైనే కేంద్రీకృతమైంది.

రెండేళ్ల తర్వాత ఉప్పల్ స్టేడియంలో ఆడనున్న కోహ్లి ఆటతీరును ప్రత్యక్షంగా చూడాలని అభిమానులు ఉబలాటపడుతున్నారు. ఉప్పల్ స్టేడియంలో కోహ్లికి మంచి రికార్డే ఉంది. ఈ స్టేడియంలో 10 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన అతను 486 పరుగులు చేశాడు. గత శుక్రవారం ఈ మ్యాచ్ టికెట్ల అమ్మకాలు ప్రారంభించగా... నిమిషాల వ్యవధిలోనే అన్నీ అమ్ముడుపోయాయి. కోహ్లి ప్రధాన ఆకర్షణ కానుండటంతో దీనిని సొమ్ము చేసుకోవాలని సన్‌రైజర్స్ యాజమాన్యం భావించి ఈ మ్యాచ్ టికెట్ల ధరలను భారీగా పెంచేసింది. మరోవైపు సాధారణ ప్రేక్షకులకు టికెట్లు లభించలేదని తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

స్థాయిభేదం లేకుండా ఎవరికి వారు తమ పరపతిని ఉపయోగించి ఈ మ్యాచ్ టికెట్లను సంపాదించడంపైనే దృష్టి పెట్టారు. దాంతో నిజమైన అభిమానుల గోడు వినేవాళ్లే కరువయ్యారు. రజత్ పాటీదార్ సారథ్యంలోని బెంగళూరు బృందం ఈ సీజన్‌ను సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌తోనే ప్రారంభించింది. ఆ మ్యాచ్‌లో ఆరు వికెట్లతో గెలిచి శుభారంభం చేసింది. అదే జోరును కొనసాగిస్తూ ప్రస్తుతం 18 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. నేటి మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌పై గెలిస్తే ఆర్‌సీబీ 20 పాయింట్లతో టాపర్‌గా ముగిస్తుంది.

ఆర్‌సీబీ, సన్‌రైజర్స్ జట్లు ముఖాముఖిగా 27 సార్లు తలపడ్డాయి. ఆర్‌సీబీ 12 మ్యాచ్‌ల్లో... సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఒక మ్యాచ్ రద్దయింది. ఇక ఉప్పల్ స్టేడియంలో ఈ రెండు జట్ల మధ్య 8 మ్యాచ్‌లు జరిగాయి. ఆరింటిలో సన్‌రైజర్స్, రెండింటిలో బెంగళూరు గెలుపొందాయి.

ఆర్చరీ కోచ్ కుల్దీప్‌కు

ఐదేళ్ల జైలుశిక్ష

జైలు శిక్షతో పాటు రూ. 15 వేలు జరిమానాగా విధించింది. కుల్దీప్ నేరాన్ని అంగీకరించగా... జస్టిస్ నరేంద్ర సింగ్ తీర్పు వెల్లడించారు. దీంతో అతడిని తక్షణమే అదుపులోకి తీసుకున్నారు. 'పోక్సో' చట్టంలోని 10వ సెక్షన్ కింద అతడికి శిక్ష విధించినట్లు న్యాయమూర్తి వెల్లడించారు. అసలేం జరిగిందంటే... 2023 ఆగస్టులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో యూత్ చాంపియన్ షిప్ శిక్షణ శిబిరం నిర్వహించారు. సోనీపత్‌లో నిర్వహించిన ఆ శిబిరంలో పాల్గొనేందుకు వచ్చిన ఓ జాతీయ స్థాయి మైనర్ ఆర్చర్‌తో కుల్దీప్ అసభ్యంగా ప్రవర్తించాడు. తెల్లవారు జామున 4 గంటలకు ఆర్చర్ నిద్రిస్తున్న గదిలోకి వెళ్లిన కోచ్ కుల్దీప్... ఆమెను లైంగికంగా వేధించాడు. అతడిని ప్రతిఘటించేందుకు విఫలయత్నం చేసిన మైనర్ ఆర్చర్ అక్కడి నుంచి ఎలాగోలా తప్పించుకొని పక్కనే ఉన్న ఇతర ఆర్చర్‌ల గదిలోకి పరుగు తీసింది. ఆ తర్వాత ఈ విషయాన్ని బయట పెడితే కెరీర్ నాశనం చేస్తానని కోచ్ భయపెట్టడంతో యువ ఆర్చర్ తన బాధను ఎవరితోనూ చెప్పుకోలేకపోయింది. తనకు సహకరిస్తే... జాతీయ స్థాయిలో స్టార్ ఆర్చర్‌గా తీర్చిదిద్దుతానని పలుమార్లు ఆమెను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించాడు. ట్రయల్స్ ముగిసిన అనంతరం సింగపూర్‌లో జరిగిన ఆసియా కప్‌నకు యువ ఆర్చర్ ఎంపిక కాగా... ఆ సమయంలో శిబిరం సందర్భంగా జరిగిన చేదు అనుభవాన్ని ఆమె తన కుటుంబ సభ్యులతో పంచుకుంది. దీంతో వారు సోనీపత్ పోలీసులకు ఫిర్యాదు చేయగా... విచారణ చేపట్టిన పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కుల్దీప్ గతంలో భారత సైన్యంలో సైతం పని చేశాడు